## హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్



**శెనార్తి మీడియా, గన్నేరురం**

అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని, హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ విమర్శించారు. బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. బీజేపీని మండల స్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. గ్రామ, పోలింగ్ బూత్ స్థాయిల్లో పార్టీ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని ఆయన ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ సీటును కోల్పోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం వంటి పార్టీలకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని, ఇది వారి అజ్ఞాన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, విలాసాగరం రామచంద్రం, బద్దం అనంతరెడ్డి, అటికం రామచంద్రం, బండి తిరుపతి, గట్టు కిషన్, బుర్ర సత్తయ్య, బోయిన మల్లయ్య, లక్ష్యం పతి, కుర్ర హరీష్, నందికొండ సురేందర్ రెడ్డి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సాయి గణేష్, గౌతమ్, వేణు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాసీంపేటలో పశువైద్యశిబిరం



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

మండలంలోని ఖాసీంపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ సుధాకర్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ కుమార్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా జిల్లా అధికారి సుధాకర్ మాట్లాడుతూ, గాలికుంటు వ్యాధి పశువుల్లో పాల ఉత్పత్తిని తగ్గించడమే కాకుండా వాటి మృతికి దారితీయవచ్చని తెలిపారు. పాడిరైతులు పశువులు టీకాలు వేయించాలని సూచించారు.కార్యక్రమంలో డాక్టర్ సురేందర్ రెడ్డి, పి. అభిషేక్ రెడ్డి , గంప వెంకన్న, బద్దం సంపత్ రెడ్డి, పాల ఉత్పత్తిదారుల డెయిరీ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే విజయరమణా రావు



**శెనార్తి మీడియా, పెద్దపల్లి**

పెద్దపల్లి మండలం అప్పన్నపేట వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన 29 మందిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించాడు.వారిని ప్రోత్సహిస్తూ సంఘటన వివరాలను పోలీసుల నుంచి, ఆర్టీసీ అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, RTC ఆర్ఎం, పెద్దపల్లి ఎసిపి గజ్జి కృష్ణా, సీఐ ప్రవీణ్, ఎస్సీలు, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి 'భూ భారతి చట్టం'

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**శెనార్తి మీడియా, తిమ్మాపూర్/గన్నేరువరం**



రాష్ట్ర ప్రభుత్వం భూ సంబంధిత సమస్యల సమగ్ర పరిష్కారమే లక్ష్యంగా కొత్త ఆర్వోఆర్ చట్టమైన భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం తిమ్మాపూర్ రైతు వేదికలో, గన్నేరువరం శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కార మార్గం లభించనుందని చెప్పారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. భూముల మ్యూటేషన్ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలని చట్టం స్పష్టం చేస్తుందని చెప్పారు. అదే సమయంలో భూమికి భూదార్ సంఖ్య కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గతంలో ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు స్థాయిల అప్పీల్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు వివరించారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై అభ్యంతరాలు ఉంటే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేయవచ్చని తెలిపారు. ఇకపై చిన్న సమస్యలు తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారమయ్యేలా బాధ్యతలు కేటాయించారని వివరించారు. మ్యూటేషన్ కోసం 2500 రూపాయల ఫీజుతో పాటు అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుపై తహసీల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేసి నిర్ణయం తీసుకోవాలని, గడువు మించి వ్యవధి జరిగితే ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ పూర్తవుతుందన్నారు. పట్టాదారు హక్కుల రికార్డులు, పాస్‌బుక్‌లను రిజిస్ట్రేషన్ రోజునే జారీ చేయనున్నట్టు చెప్పారు. పాస్‌బుక్ జారీకి 300 రూపాయల ఫీజు వసూలు చేయనున్నారని తెలిపారు. అన్ని సమస్యలపై అవసరమైన చోట ఉచిత న్యాయ సలహా ఇవ్వనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, రెవెన్యూ డివిజన్ అధికారి మహేశ్వర్, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, తహసీల్దార్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ నిబంధనలపై కళాబృందం అవగాహన

**శెనార్తి మీడియా, పెద్దపల్లి**



రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి బస్టాండ్ వద్ద ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీపై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో కమిషనరేట్ పోలీస్ కళాబృందం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, సీటుబెల్ట్ వాడకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలపై కళాబృందం పాటలు, నాటకాల రూపంలో ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్సై రవికాంత్ మాట్లాడుతూ... రోడ్డుప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం違法మని, అలా చేసిన తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయన్నారు. బస్సుల్లో ప్రయాణించే వారు కిటికీల నుంచి చేతులు బయట పెట్టకూడదని, వాహనం నడుపుతూ మొబైల్ ఉపయోగించరాదని సూచించారు. వాహనదారులు అవసరమైన పత్రాలు వెంట తీసుకువెళ్లాలని, రోడ్డు సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలను కోరారు. కళాబృందం ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# ఎల్ఆర్ఎస్ పకడ్బందీగా అమలు చేయాలి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

రాష్ట్రంలో ఎల్.ఆర్.ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం) అమలు లో జిల్లాల్లో పకడ్బందీ పాటించాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ సూచించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ, ఈ నెల 30వ తేదీ వరకు ఎల్.ఆర్.ఎస్ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభించనుందని తెలిపారు. ఫీజు చెల్లించిన దరఖాస్తులపై ప్రొసీడింగ్స్‌ను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని, భూ క్రమబద్ధీకరణ మంజూరు పత్రాలను సకాలంలో ఇవ్వాలని సూచించారు. ఫీజు వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు రాయితీ ప్రయోజనాలపై అవగాహన కల్పించేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. జిల్లా పంచాయతీ, మున్సిపల్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



## లక్ష్మీనారాయణపురంలో విషాదం

- ప్రసూతి సమయంలో పసికందు మృతి
- ఫోన్ లో పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ

**శెనార్తి మీడియా, పాలకుర్తి**



పాలకుర్తి మండలంలోని లక్ష్మీ నారాయణపురం గ్రామానికి చెందిన అర్చన (22) అనే గర్భి ణీ, తన మొదటి కాన్పు కోసం పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరింది. డెలివరీ సమయంలో పుట్టిన శిశువు మృతిచెందిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలముకున్నాయి.ఈ సమాచారం తెలుసుకున్న పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, బాధిత కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించి సంఘీభావం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైద్యంలో నిర్లక్ష్యం జరిగిందన్న అనుమానాలపై తీవ్రంగా స్పందించిన ఆమె, పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు "ఒక తల్లి తన మొదటి బిడ్డ పుట్టిన ఆనందాన్ని అనుభవించే సమయంలో ఇలాంటివి జరగడం హృదయవిదారకం. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వారి పక్కనే ఉంటాను," అని పేర్కొన్నారు.

## నర్సింహులపల్లిలో పోషణ్ పక్వాడా

- చిరుధాన్యాల వినియోగంపై అవగాహన




**శెనార్తి మీడియా, తంగళ్లపల్లి**

మండలంలోని నర్సింహులపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్, చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటిని రోజువారీ జీవనశైలిలో ఎలా ఉపయోగించుకోవాలి అనే విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అలాగే గర్భధారణ ప్రారంభమైన దగ్గరి నుంచి 1000 రోజుల వరకూ శిశువు పోషణకు తీసుకోవాల్సిన ఆహారపద్ధతుల గురించి వివరించారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, సీడీపీఓ ఉమారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు హిందూజా, సంపత్, మాధవి, సూపర్వైజర్ సుస్మిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## మంత్రి కొండ సురేఖకు ఫోటో బహుకరణ

**పద్మశాలీ సమస్యలపై స్పందించిన మంత్రి**



**శెనార్తి మీడియా, జమ్మికుంట**

తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను గురువారం హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సమాఖ్య ఉపాధ్యక్షుడు సిలువేరు శ్రీకాంత్ నేత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకు ఫొటోను బహుకరించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ నేత రాష్ట్రంలో పద్మశాలీ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారని శ్రీకాంత్ తెలిపారు. పద్మశాలీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## అర్చకుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**శెనార్తి మీడియా, మహాదేవ్‌పూర్**

మహాముత్తారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన హనుమాన్ దేవాలయ అర్చకుడు కాగితపు లింగమూర్తి ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఆయన మరణంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం సంతాపం తెలియజేస్తూ, కుటుంబానికి 11,116 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కార్యదర్శి కర్నె సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు సిరసన గండ్ల వెంకట రమణాచార్యులు, జిల్లా ఉపాధ్యక్షుడు హరిరఘుశర్మ, వంగళ సత్యనారాయణ చార్యులు, నర్సింగోజు సత్యనారాయణ పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు కాగితపు నవీన్, కాగితపు వెంకన్న హాజరయ్యారు.

## పాత బకాయిలు పూర్తి చేసి బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలో 2024-25 యాసంగి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, రైస్మిల్లర్లు పాత బకాయిలు పూర్తి చేసి బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న బియ్యంకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. బాయిల్డ్ రైసిమిల్లర్లకు గతంలో కేటాయించిన వరిధాన్యం లక్ష్యాలకు సంబంధించి పాత బకాయిలు లేకుండా పూర్తి చేయాలని, బ్యాంక్ గ్యారంటీలు వెంటనే ఇవ్వాలని, లేని పక్షంలో ఈ సీజన్లో ధాన్యం కేటాయించడం జరుగదని తెలిపారు. ధాన్యం దిగుమతి ఎలాంటి కోతలు లేకుండా చేయాలని తెలిపారు. రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే సమయంలో నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బాయిల్డ్ రైస్మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## సభను విజయవంతం చేయండి



**శెనార్తి మీడియా, ఇంద్రవెల్లి**

ఈనెల 20న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో జరిగే అమరవీరుల సంస్మరణ సభకు రావాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గారిని రగల్ జెండా కమిటి సభ్యులు ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి,ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అమరుల వీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర నలుమూలల నుండి ఆదివాసీలు,మేధావులు,కార్మికులు,కర్షకులు,ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభకు ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క రానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రగల్ జెండా కమిటి అధ్యక్షుడు తోడసం నాగోరావు,మాజీ అధ్యక్షుడు కోరెంగ సుంకటరావు, ఆదివాసీ సంఘాలు నాయకులు మెస్రం నాగనాథ్, జుగ్నాక భారత్, దుర్వ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిని అనాథాశ్రమంలో చేర్పించిన పోలీసులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల పట్టణంలో మతిస్థిమితం సరిగా లేని వృద్ధురాలిని పోలీసుల ఆధ్వర్యంలో అనాథాశ్రమంలో చేర్పించిన ఘటన చర్చనీయాంశమైంది. జాఫర్నగర్ లోని సాయిబాబా టెంపుల్ వద్ద కొన్నిరోజులుగా వృద్ధురాలిని చూసిన స్థానికులు అనుమానంగా గుర్తించారు. ఈ విషయాన్ని సీపీ కార్యాలయ సూపరింటెండెంట్ సంధ్య గమనించి, వెంటనే స్పందించారు. వృద్ధురాలిని గుర్తించిన సంధ్య, ఆమె స్థితి గురించి సమాచారాన్ని కల్వరి యువశక్తి సంస్థ అధ్యక్షుడు కుమారుకు అందించారు. పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు సత్యనారాయణ, రాజు కుమార్ వృద్ధురాలిని సురక్షితంగా తీసుకుని, ఆమెను అనాథాశ్రమంలో చేర్పించారు. ఈ చర్యకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసు అధికారులు వెల్లడించారు. వృద్ధురాలికి పూర్తి శ్రద్ధతో సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని, ఆమె యొక్క భవిష్యత్తును ఆశ్రయ ఆశయంతో హోమ్ కోసం సులభంగా ప్రదేశం సమకూర్చడం జరుగుతుందని తెలిపారు.

## విద్యార్థులు పోటీపడే తత్వాన్ని అలవర్చుకోవాలి



- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**శెనార్తి మీడియా, ఉట్నూర్**

విద్యార్థులు పోటీ పడే తత్వాన్ని అలవర్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సూచించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని హెచ్ కేజేఎన్ పంక్షన్ హాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యానువల్, కల్చరల్ , స్పోర్ట్స్ డే ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ముఖ్య అతిథ గా పాల్గొని మాట్లాడారు.విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాల వైపు నడవాలని పేర్కొన్నారు. కష్టపడి చదివితే అనుకున్న సులువుగా సాధించవచ్చని,పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా నడుచుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని అన్నారు.విద్యార్థులకు అత్యాధునిక టెక్నాలజీతో విద్యాబోధనను అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ రాణి, డాక్టర్ అనిత, షేక్ ముజీబ్, స్వామి, చంద్రశేఖర్, డాక్టర్ రవీందర్, కరుణాకర్, శ్రీకాంత్, పెంటన్న, డాక్టర్ కిషన్, తిరుపతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తాంసి పీహెచ్‌సీ ఆకస్మికంగా తనిఖీ

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్ అన్నారు. గురువారం తాంసిలోని పీఎచ్సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందంతా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాజరై సేవలందించాల్సిందిగా సూచించారు. సమయానికి హాజరు కాని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రిలోని రికార్డులు, ఫార్మసీ గదిని పరిశీలించిన ఆయన, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎండాకాలం కొనసాగుతుండటంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్లూయిడ్ లు స్టాక్ లో ఉండేలా చూడాలని సూచించారు. వైద్య సేవలందించడంలో సిబ్బంది ముందుండాలన్నారు.

### ఆసుపత్రికి భోగి వెళ్తే ఆధార్ కార్డు తప్పనిసరి

ఏప్రిల్ 18 నుంచి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్ తెలిపారు. ఆధార్ కార్డును ఆధారంగా తీసుకోవడం వల్ల రోగికి ఇప్పటివరకు అందించిన వైద్యసేవల వివరాలు కంప్యూటర్లో నమోదు చేయడం సులభమవుతుందన్నారు. భవిష్యత్తులో రోగి ఆరోగ్య సమాచారం తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. రిమ్స్, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందే సమయంలో రోగులు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## గాంధీ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు చర్యలు



- ఆత్రం సుగుణక్క
- ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ రాస్తారోకో

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఇంద్రవెల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాస్తారోకో నిర్వహించింది. ఈ సందర్భంగా బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సుగుణక్క, కాంగ్రెస్ బలపడుతుందన్న భయంతోనే మోదీ, అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ అగ్రనాయకులపై ఈడీ ద్వారా వేధింపులకు పాల్పడుతోందన్నారు. ఇలాంటి దాడులు తాము భయపడబోమని, రాబోయే రోజుల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పుతారని హెచ్చరించారు. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై బురదజల్లే ప్రయత్నాన్ని దేశ ప్రజలు సహించబోరన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. ఈడీ కేసుల పేరుతో వారిపై మచ్చ వేయాలని చూసే కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు విశాల్ పరత్వాగ్, మండల అధ్యక్షురాలు లక్ష్మీబాయి, యాకుబ్ భేగ్, తులసిరామ్, గోపీనాథ్, పీరాజి, గణేష్, నారాయన్, భగవాన్, సునిల్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తుడం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపక అధ్యక్షులకు ఘన సన్మానం

**శెనార్తి మీడియా, ఉమ్మడి ఆదిలాబాద్**



కేరమేరి మండలం జోడేఘాట్‌లో రెండు రోజుల క్రితం తుడం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులుగా కోట్నాక విజయ్, వ్యవస్థాపక అధ్యక్షులుగా బుర్స పోచయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, గురువారం జిల్లా కేంద్రంలో ఘన సన్మానం జరిగింది. భాజపా సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు తన నివాసంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ధోనీ శ్రీశైలంతో కలిసి నూతన అధ్యక్షులను పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల కోసం అనేక సంవత్సరాలుగా పోరాడిన ఘనత విజయ్, పోచయ్యలదేనని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యత వీరి భుజాలపై ఉందని, వారి హక్కులు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పోరాటాల ద్వారానే హక్కులు రక్షించుకోవచ్చని, అప్పుడు మాత్రమే సమాజంలో గుర్తింపు వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య, నాయకులు ప్రసాద్ గౌడ్, మాటూరి జయరాజ్, గుండ వెంకన్న, దీపక్ అడ్వొకేట్, మురళి గౌడ్, శ్రీకాంత్, శంకర్, నాగేష్ పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కొరడా

- రెండు ట్రాక్టర్లు సీజ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని మైలారం వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్ చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఇలాంటివి చట్టానికి విరుద్ధమని పేర్కొంటూ, ట్రాక్టర్ల ఓనర్లు పసుల రవీందర్, గట్టం సాయికుమార్ గౌడ్, అత్తిసాయి, కొమ్ము రాజేష్ లను అరెస్ట్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## క్యాతన్‌పల్లి రైల్వే గేటు పూర్తిగా మూసివేత



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి రైల్వే గేటును గురువారం నుంచి శాశ్వతంగా మూసివేయనున్నారు. ఈ విషయాన్ని రైల్వే అధికారులు అధికారికంగా ప్రకటించారు. గేటుపై నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి వాహనదారులంతా అదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రైల్వే అధికారులు గేటుపై మూసివేతకు సంబంధించిన సూచన పత్రాలు అంటించారు. గురువారం సాయంత్రానికి గేటు ముందు ఇనుప రాడ్లతో అడ్డువేసి శాశ్వతంగా మూసివేశారు. ఇకపై వాహనదారులు ఫ్లైఓవర్ ద్వారానే ప్రయాణించాల్సి ఉంటుంది.

## గురుకుల ఫలితాల్లో ప్రతిభ చాటిన బన్న మృదుల్

**శెనార్తి మీడియా, బెల్లంపల్లి (మంచిర్యాల)**



తెలంగాణ గురుకుల సెట్ 2025 ఫలితాల్లో కాసిపేట మండలానికి చెందిన బన్న మృదుల్ ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. మొదటి విడత ఫలితాల్లో మృదుల్ బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతికి చేరికకు అర్హత పొందాడు. కాసిపేట గ్రామానికి చెంది న బన్న సంపత్ కుమార్, సంధ్య దంపతుల రెండవ కుమారుడైన మృదుల్, విద్యారంభం విస్డమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చేసాడు. రెండవ తరగతి వరకు అక్కడే చదివిన అతను, 3వ, 4వ తరగతులు అక్షర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పూర్తి చేశాడు. గురుకుల సెట్‌లో విజయంతో మృదుల్‌కి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు ఘనంగా అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే తమ్ముడి వివాహ వేడుకల్లో హాజరైన ప్రముఖులు, పార్టీ నేతలు



**శెనార్తి మీడియా, సిర్పూర్**

సిర్పూర్ మండలంలోని గుంనూర్ గ్రామంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గారి తమ్ముడు సుధాకర్ గారి వివాహం నేడు అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు గారు, ఇంద్రవెల్లి, జైనూర్,జన్నారం,ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు,వైస్ ఛైర్మన్లు,ఆర్టీఐ మెంబర్లు,వివిధ మండలాల అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వాదించారు.

## అడ్వకేట్ పై దాడిని నిరసించి నిరసన వ్యక్తం చేసిన బార్ అసోసియేషన్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

స్థానిక జిల్లా కోర్టు భవనం ముందు ఈ రోజు అడ్వకేట్లు దాడి ఘటనను నిరసిస్తూ నిరసన తెలిపే కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భుజంగరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ, అడ్వకేట్లు పై దాడి చేయడం అనేది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. నిన్న సూర్యపేటలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, అక్కడి అడ్వకేట్ పై దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్లకు రక్షణ కల్పించే చట్టాలను త్వరగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు దత్తు, తుల ఆంజనేయులు, గోపతి రవి, శ్రీరాములు, జాడి తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

